క్లుప్తంగా

ఫెలోషిప్ సమావేశం

కడియం: గ్రామంలోని ఫెలోషిప్ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యుడు, రెవరెండ్ కె.మోహన్ పెనూయేలు ప్రార్థనా మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిష్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, డి.రత్నరాజు, సోలోమోన్ శుభాలు అందించారు. సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా బెంజమిన్ హాజరయ్యారు.

ఎస్ఈబీ సిబ్బంది దాడి



నిందితులు, సారాతో ఎస్ఈబీ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ సౌత్స్టేషన్ సిబ్బంది సోమవారం శాటిలైట్‌సిటీ గ్రామంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. కోమలి సత్యవతిని అరెస్టు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేసిన శాటిలైట్‌సిటీకి చెందిన భీమన పోతురాజు ఎలియాస్ పట్టియ్యను అరెస్టు చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సౌత్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ఇనిస్టిట్యూట్ సమీపంలోని ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఓపెన్‌లైన్ బ్రాంచ్ సెక్రటరీ, స్టేషన్ సీటీ సుంకర చంద్రమౌళి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సంఘ్ సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు, సంఘ్ ఎన్నికలు తదితర అంశాలపై ప్రధానంగా చర్చిస్తామన్నారు.

రాట ముహూర్తం

కడియం: వినాయక చవితి నవరాత్రులు మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పోస్టాఫీసు వీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద సోమవారం కడియం గ్రామ పెద్దల సమక్షంలో రాట ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, తుమ్మ తాతనాయుడు, పొన్న బాల, వెలుగుబంటి నాని, శాకా పట్టాభి, ఉప్పులూరి భూషణం, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డీపీవో సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు సంబంధించి నిబంధనల అమలుపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం రివర్‌బే సమావేశ మందిరంలో సోమవారం జిల్లా పరిధిలోని గ్రేడ్1, 5 కార్యదర్శులకు ఆరు రోజులు నిర్వహించే రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డీపీవో సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లేఅవుట్ల ఏర్పాటు, పరిపాలనా విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధిహామీ పనులు, క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ ఆరమ్‌స్ట్రాంగ్, ట్రైనీ మాస్టర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పార్టీ ఉన్నతికి కృషి చేయాలి



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆరిఫ్

రాజమహేంద్రవరం సిటీ: నిబద్ధతతో పనిచేసి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ అబ్దుల్ ఆరిఫ్ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో డాక్టర్ గూడూరు శ్రీనివాస్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అబ్దుల్ ఆరిఫ్ మాట్లాడుతూ తనపై నమ్మకంపై పదవి ఇచ్చిన సీఎం జగన్‌కు, పదవి రావడానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంవో విభాగం.. సత్వర వైద్యం

- ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు
- 24 గంటలూ వైద్యసాయం
- రోగుల హర్షం



ప్రమాదానికి గురైన వ్యక్తికి వైద్య సహాయం అందజేస్తున్న సీఎంవో విభాగం వైద్యులు

కంబాలచెరువు: పేదలకు నాణ్యమైన, సౌకర్యవంతమైన వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఏ ఒక్కరూ వైద్య సహాయం అందక ఇబ్బందుల పాలు కాకూడదనే సంకల్పంతో వైద్యశాఖలో పలు కీలక మార్పులు చేస్తోంది. కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తయారు చేస్తూ, అక్కడ అందించే వైద్యసేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టింది. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా వేల రూపాయల వైద్య చికిత్సలు, సౌకర్యాలను అందిస్తోంది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి అడుగులు వేస్తోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాల రాకతో జిల్లా ఆసుపత్రి బోధనాసుపత్రిగా రూపాంతరం చెందింది. మెడికల్ కళాశాలను అనుసంధానంగా ఆ ప్రమాణాలను పాటిస్తూ వైద్య సేవలందిస్తోంది.

సీఎంవో విభాగంలో..

రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) విభాగం ఏర్పాటైంది. ఆసుపత్రికి వివిధ రకాల వ్యాధులు, ప్రమాదాలతో వచ్చే వారికి సీఎంవో దిశానిర్దేశం చేస్తోంది. గతంలో ఆసుపత్రికి వచ్చే రోగులు ముందుగా ఓపీ చీటీ రాయించుకోవడానికి వెళ్లేవారు. అక్కడ వారు ఏ వైద్య సహాయానికి వచ్చారో కౌంటర్‌లో సదరు ఓపీ చీటీ ఇచ్చే వ్యక్తి అడిగేవారు. బాధిత వ్యక్తి తాను ఏ వ్యాధికి, ఏ వైద్య చికిత్స అవసరం అయ్యి వచ్చాడో చెపితే ఆ ఓపీ చీటీపై అతను కలవాల్సిన వైద్యుడు రూమ్ నెంబర్ రాసి ఇచ్చే వారు. ఇది పాత విధానం.

కొత్త విధానంలో..

ఆసుపత్రిలో పూర్తిగా సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో చికిత్స విధానాలతో పాటు రోగికి అందే సౌకర్యాలు సైతం పూర్తిగా మారిపోయాయి. ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి ఓపీ చీటీ రాయించుకుని ముందుగా సీఎంవో గదికి వెళ్లాలి. అక్కడ ఉన్న వైద్య నిపుణులు వారిని పూర్తిగా పరీక్షిస్తారు. వారికి ఏ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు. ఆసుపత్రిలోని వారు కలవాల్సిన వైద్యుడికి ఆ కేసును రిఫర్ చేస్తారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి ఎక్కడికి వెళ్లాలి, ఏ స్పెషలిస్టును కలవాలి, ఆయన ఎక్కడ ఉంటారు అనే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. సీఎంవో విభాగంలో 24 గంటలు వైద్య సహాయం అందించేందుకు మొత్తం ఆరుగురు వైద్యులు అందుబాటులో ఉంటారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన సేవలు



నిత్యం సీఎంవోకి వచ్చే రోగులకు వారికి అవసరమయ్యే వైద్యసేవలను వివరిస్తున్నాం. ముందుగా వారు ఆసుపత్రికి ఏ వైద్య చికిత్సలు వచ్చారో తెలుసుకుంటున్నాం. వారిని పరీక్షించి సంబంధిత వైద్య విభాగానికి బాధితులను పంపిస్తున్నాం. ప్రమాదంలో గాయపడిన వారు, పాము కాటుకు గురైన వారు. ఇతర ఎమర్జెన్సీ కేసులకు సైతం సీఎంవోలో వైద్య సహాయం చేస్తున్నాం. రోగికి పూర్తి అర్థమయ్యేలా వారికి వచ్చిన వ్యాధిని వివరిస్తున్నాం. నిత్యం అధిక సంఖ్యలో రోగులు సీఎంవో సేవలు వినియోగించుకుంటున్నారు. ఇక్కడికి వచ్చిన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూస్తున్నాం.

– డాక్టర్ అనూహ్య, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వ ఆసుపత్రి

ఆరోగ్యమిత్రకు నగదు ప్రోత్సాహకం



ఆరోగ్యమిత్ర మోసిన్‌కు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నిబద్ధతతో పనిచేసే ఆరోగ్య మిత్రలకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆగస్టుకు సంబంధించి సాయి హాస్పిటల్‌కు చెందిన ఆరోగ్య మిత్ర డి.మోసిన్‌కు సోమవారం రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలు ఆరోగ్యశ్రీ కింద నమోదు చేయడం ద్వారా ఆయా ఆసుపత్రుల అభివృద్ధి కోసం కూడా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి



అర్జీలను స్వీకరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందనకు 19 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి, అర్జీదారులకు న్యాయం చేస్తామన్నారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ రెండు కార్యక్రమాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని సూచించారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెంటెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

సీటీఆర్ఐ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజినల్ అధికారి ఏ.చైత్రవర్షిణి ప్రజల నుంచి వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు స్వీకరించారు. ఏ ఒక్క అర్జీ రీఓపెన్ కాకుండా పరిష్కరించాలని డివిజినల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు

- ఎంపీ భరత్ రామ్
- కార్పొరేషన్ ప్రాంగణంలో ట్రాక్టర్ల ప్రారంభం



జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్య మెరుగుకు నగర పాలక సంస్థ పది ట్రాక్టర్లను కొనుగోలు చేయడం శుభపరిణామమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆ కొత్త ట్రాక్టర్లను సోమవారం కార్పొరేషన్ ప్రాంగణంలో ఎంపీ భరత్‌రామ్, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ప్రైవేటు ట్రాక్టర్లన అద్దెకు తీసుకుని పారిశుధ్య పనులకు ఉపయోగించడం జరుగుతోందని, దాని వల్ల ఏటా సుమారు రూ.కోటి అద్దెల రూపంలో చెల్లించాల్సి వస్తోందన్నారు. నగరపాలకసంస్థ చొరవ చూపి పది ట్రాక్టర్లను కొనుగోలు చేయడం వల్ల ఏటా రూ.50 లక్షలు ఆదా అవుతాయన్నారు. నగరంలో చెత్త లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ఈ ట్రాక్టర్లు ఉపయోగపడతాయన్నారు. గోదావరి శుభ్రతకు రూ.55 కోట్లు మంజూరయ్యాయని, అయితే కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆ నిధులు విడుదల చేయలేదన్నారు. నగరంలో కంబాల చెరువును మూసేస్తున్నారనే ప్రచారం అవాస్తమన్నారు. నగరంలోని ఆర్యాపురం, రైల్వే స్టేషన్ ఏరియా, కంబాల చెరువు ప్రాంతాల్లో ముంపు సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరపాలకసంస్థ ఏర్పడినప్పటి నుంచీ టీడీపీ నాయకులే మేయర్లుగా ఉన్నారని, అప్పుడెందుకు ఈ ముంపు సమస్యపై దృష్టి సారించలేదని ప్రశ్నించారు. క్లీన్ మాస్టర్ మెషీన్ ద్వారా డ్రైనేజీల్లో పూడిక తీయిస్తున్నామని, ఈ మెషీన్‌తో గోదావరిని కూడా ప్రక్షాళన చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఎస్ఈ పాండురంగారావు, ఎంహెచ్ఓ వినూత్న, సీపీ మూర్తి, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 39వ డివిజన్‌లో గడప గడపకూ..



ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఏ ఇంటి గుమ్మాన్ని తట్టినా జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి స్పష్టంగా తెలుస్తోందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, డివిజన్ ఇన్‌చార్జి లంకా ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ డివిజన్‌లోని నటరాజ్, జయరామ్ థియేటర్, రామచంద్రరావుపేట తదితర ప్రాంతాల్లో గడప గడపకూ వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్ పాలనపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు. అలాగే రామచంద్రరావు పేటలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలపగా, ఆయన వెంటనే నగరపాలక సంస్థ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. రాత్రి సమయంలో ఆకతాయిల అల్లరిపై స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే శ్రీనివాస్ పోలీసు అధికారులతో మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోవైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, ఆర్యాపురం రమా సత్యనారాయణ స్వామి ట్రస్టు కమిటీ డైరెక్టర్లు వి.కాశీవిశ్వనాథ్, రాఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల లక్ష్యాలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు జగనన్న లేఅవుట్‌లో ఇంకుడుగుంతలను(సోంపిట్) ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఆదేశించారు. హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం హౌసింగ్ అధికారులు, ఉపాధి సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఇచ్చిన లక్ష్యాలను సమష్టిగా పూర్తి చేయాలన్నారు. తొర్రేడు జగనన్నకాలనీ లేఅవుట్‌లో ప్రస్తుతం డ్రైనేజీలు లేనందున, ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతలు తవ్వాలని, ఎస్టిమేషన్ వేసిన ప్రకారం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ హైమావతి, ఏఈ సత్యనారాయణ, ఉపాధిహామీ ఏపీవో బి.సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రియాంక పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి



పల్లకడియంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పల్లకడియం, రామస్వామిపేటలలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలలో మహిళలకే అగ్రాసనం వేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ గతంలో చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అప్పటి వరకు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులలో ఉన్న రుణాలను నాలుగు విడతలుగా మీ ఖాతాలలోకి జమ చేసిన విషయాన్ని మరచిపోవద్దన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సీతానగరం: లంకూరు ఏటిగట్టు వద్ద ద్వాదశ జ్యోతిర్లింగ సహిత మృత్యుంజయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన సంగీత విభావరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సోగ్గాడు శోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శోభన బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం నిర్వహణలో స్థానిక విక్రమహాల్లో సోమవారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది మహిళా గాయకులు అలనాటి ఆణిముత్యాల్లాంటి పాటలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పట్నాల వెంకట సుబ్బమ్మ మెమోరియల్ ట్రస్టు, హ్యూమన్ రైట్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ పట్నాల శ్రీనివాసరావు హాజరయ్యారు. మహిళా గాయకులను సత్కరించి మోమెంటోలు అందజేశారు. సన్మానం పొందిన గాయకుల్లో భారతి కృష్ణవేణి, శారద, దీపిక, లలిత, ఈమని శైలజ, ప్రభ, లక్ష్మి, సూర్యకుమారి, శ్రీదేవి, బళ్ల సత్యవతి, గిరిజ, వీర లక్ష్మి ఉన్నారు. కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, శోభన్ బాబు ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షుడు ఆదిత్య ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బట్ట బ్రహ్మం, రాయుడు చంద్ర కుమార్, బళ్ల శ్రీనివాస్, రాకేష్ సంస్థ సీవీ రమణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక లాలాచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో వినియోగదారుల చట్టంపై కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గోట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల క్లబ్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్యాప్కో రాష్ట్ర కార్యదర్శి హెజెబు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. రాజమండ్రి కన్స్యూమర్ కౌన్సిల్ సెల్ కార్యదర్శి, న్యాయవాది ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్న ప్రతి వస్తువుకూ రశీదు తప్పక తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు చట్టంపై పరీక్ష నిర్వహించి, బహుమతులు అందజేశారు.

చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ

రాజానగరం: దైనందిన ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత పెరుగుతోందని, ఆసక్తి కల మహిళలు ఈ రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ అనే అంశంపై సోమవారం కేవీకేలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో శిక్షణతో పాటు ప్రదర్శన కూడా ఏర్పాటుచేశారు. సీతానగరానికి చెందిన మాస్టర్ ట్రైనర్ చిడిపి నాగభూషణం ఆధ్వర్యంలో చిరుధాన్యాలైన రాగులు, సామలు, ఊదలు, అరికెలు, అండు కొర్రలు, సజ్జలు, జొన్నలతో బిస్కెట్లు, కేక్‌లు, మురుకులు, మున్నగు ఆహారా పదార్థాల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాపవరంలో గడప గడపకూ..



కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, వారి ఆర్థికాభివృద్ధికి దోహద పడుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో మూడో రోజు సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక వినాయకుని ఆలయంలో స్వామిని దర్శించుకున్న అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు గణేష్ నగర్‌లో గడప గడపకూ తిరిగారు. ఈ సదంర్భంగా స్థానికులు మురుగునీటి కాలువల నిర్మాణం, ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్యలను తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కాపవరంలో సొంతిళ్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కోరుకొండ, కాపవరం గ్రామస్తుల కోసం ఎంపిక చేసిన ఇళ్ల స్థలాల విషయం కోర్టు వివాదంలో ఉండటంతో కొత్తగా స్థలాలను ఎంపికచేయనున్నట్టు తెలిపారు. కాపవరం అభివృద్ధికి చంద్రబాబు పాలనలో కేవలం రూ. 80 లక్షలు కేటాయిస్తే, జగనన్న ప్రభుత్వం రూ.3 కోట్ల రూపాయలు నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ జాజుల రాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసియ్య, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు ఇండిగమెల్లి సత్యనారాయణ, హితకారిణి సమాజం డైరెక్టర్ కాలచర్ల శివాజీ, ఎంపీటీసీ కాలచర్ల నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా బాబీ, శ్రీరంగం శ్రీను, అయిల శ్రీను, బుగ్గిలం భాను, బయ్యే దుర్గయ్య, కొడేటి నాగార్జున, సచివాలయం సెక్రటరీ అన్వర్ పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	:	ఖుషి
సూర్యమినీ	:	బెదురులంక 2012
సూర్యప్యాలెస్	:	దిఈక్వలైజర్-3
స్వామి	:	ఖుషి
శివజ్యోతి	:	ఖుషి
అనుశ్రీ	:	ఖుషి
రాజా	:	ఖుషి
అశోక	:	జైలర్
ఊర్వశి	:	గాండీవధారి అర్జున
రంభ	:	భోళాశంకర్
మేనక	:	బాయ్స్‌హాస్టల్,
భూతాలబంగ్లా		
గీతాఅప్సర	:	బెదురులంక 2012
నామవరం		
పీఎస్ మహల్	:	ఖుషి
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	ఖుషి
కడియం		
వెంకటసూర్య	:	ఖుషి